# కాంచనమేఘం



యం.కవిత

*ఇది కలియుగం; అందులో ఆకలి యుగం- పెళ్ళికాని ఆడపిల్ల సైతం- నీత్యవినీతులకతీతంగా ప్రాక్టికల్‌గా- ఆలోచించడమే కాదు ఆచరించవలసివస్తే....*

"ఎంత మాటనవలసివచ్చింది" కోపంతో విసురుగా యిల్లు దాటి వీధిలోకెళ్ళిపోయిన కూతుర్ని చూసి కంగారు పడింది భాగ్యమ్మ. "కాంచన.... కాంచన...." ఆవేదనగా పిలిచింది కాని, సుడిగాలిలా వెళ్ళిపోయిన కాంచన కది వినిపించలేదు. ఆమె అప్పుడే వీధిదాటి పోయింది.

"నాయనా కిట్టూ పరుగున బస్టాపు కెళ్ళి. నేను వెళ్ళొద్దు వెనక్కి వచ్చేయమంటున్నానని చెప్పి మా అమ్మాయిని పిలుచుకురా బాబూ" వీధిలో ఆడుకుంటున్న ఎదురింటి కుర్రాడికి కేకేసి చెప్పింది. వాడు వెళ్ళినంత వేగంగా వెనక్కివచ్చి. "అక్క బస్టాపులోలేదు. వెళ్ళి పోయింది." అన్నాడు.

"వెళ్ళి పోయిందా" కొలది క్షణాలామెకు ఊపిరందనట్లయింది. అనంతరం కొంత తేరుకొని. అవును వెళ్ళకేంచేస్తుంది. తనేగా బరితెగించి వెళ్ళమంది." కదిలేందుకు ఓపికలేనట్లు వున్న దగ్గరే నేలమీద కూలబడిందామె. "లోకమెంత మారిపోయింది" ఐదునిముషాలనంతరం కొంతసమాధాన పడటానికి ప్రయత్నిస్తూ మళ్ళీ ఆలోచిస్తుంది. తన చిన్నతనంలో చదువుకుంటాను మొర్రోఅని ఎంత ఏడ్చి మొత్తుకున్నా, పయిటలేసినపిల్లని, చదువు మాన్పించి పెళ్ళి చేసి అత్తారింటికి పంపేసేవారు. కాని నేడు....అనుక్షణం ఎన్నో కష్టనష్టాలెదురవుతున్నా. ఆడపిల్లలు బైటి ప్రపంచంలోకెళ్ళి ఉద్యోగాన్వేతలు సంపాదించాలి. రెక్కాడితేగాని, డొక్కాడని రోజులు, బ్రతుకులు. అప్పటికీ కాంచన నోరు తెరిచి అననే అనింది. "అమ్మా నాకు పెళ్ళి చేసుకొని మర్యాదగా బ్రతకాలనివుంది. నన్నన్యాయం చెయ్యకు, నా కిష్టం లేదా బ్రతుకు" అని ఆడపిల్ల సిగ్గువిడచి, నోరు నెరచి అడిగినా పెళ్ళి చెయ్యలేని నిర్భాగ్యపు బ్రతుకులు నేటి తల్లిదండ్రులవి.

"అమ్మా ఎదురింటి కిట్టూ అన్నం తింటున్నాడే. అమ్మా ఆకలితో ఛస్తున్నానే, కాస్త అన్నమే." దిగాలుపడి గోడకు చేరగిలబడి కూర్చున్న బాబు అన్నాడు.

"అమ్మా కళ్ళు తేలిపోతున్నయ్యే." ఒక మూల చింకి చాప మీద పడుకొని వున్న పాప నీరసంగా మూలిగింది.

రెండ్రోజులబట్టి యింట్లో ఎవరికీ తిండీతిప్పలు లేవు. ఇప్పటికే అన్నిచోట్లా అప్పులున్నాయ్. ఇక తమకి అప్పిచ్చే నాధుడేలేడు.

"అమ్మా ఆకలే" చంటోడు ఏడుపు లంకించుకున్నాడు.

"ఏడిస్తే ఎలా చిన్నా. అక్క డబ్బు తేవటానికే వెళ్ళింది. బహుశా వచ్చేస్తుందొచ్చు. ఇంకాసేపు ఓపికపట్టు. అక్కరాగా క్షణంలో వండి వడ్డించేస్తాను." వాడిని దగ్గరకు తీసుక లాలించింది.

"అమ్మా ఒక పైసా అన్నా వుంటే ఇవ్వవే. ఏవన్నా కొనుక్కు తింటాను." బాబు కొండంత ఆశగా అడిగాడు.

"అయ్యో నాతండ్రీ. ఒక్క పైసాకి ఈ రోజుల్లో ఏమొస్తయిరా. అయినా పైసాకికూడా టికానాలేని బ్రతుకులు మనవి." తల్లి మాటలకి వాడు నిరుత్సాహంగా తలతిప్పుకున్నాడు.

తన చిన్నతనంలో ఒకపైసాకూడా విలువయింది. ఇక ఒక రూపాయి పట్టుకొని దుకాణానికెళితే. సంచినిండా సరుకు లొచ్చేవి. కాని ఇప్పుడు మనిషిలో మానవత్వం దిగజారినట్లు, సంఘంలో నీతి. న్యాయం దిగజారినట్లు, సరుకుల్లో నాణ్యత దిగజారినట్లు రూపాయి విలువ కూడా అంతకంతకు ఇంకా ఇంకా దిగజారిపోతుంది. అన్నట్లు కాంచన ఏవి చేస్తుందో. మూడు పువ్వులు ఆరు కాయలుగా వుండవలసిన తన బ్రతుకిలా దిగజారిపోయినందుకు పాపం దాని ప్రాణమెంత విలవిలలాడిపోతుందో తనకి తెలుసు. అయినా తప్పని పరిస్థితి. అది డబ్బు తెస్తే సరి. లేకపోతే ఈ రాత్రి అంతా నల్లుల మందు తాగి గమ్మున పడుకోవాలంతే."

"కాంచన.... కాంచన...." బయట నుంచి, అస్థిరంగా వున్న జగన్నాధం స్వరం వినిపించింది.

'తాగి వచ్చినట్లున్నాడు.' భాగ్యమ్మ తనలో తాను గొణుక్కో సాగింది. ఒకనాడు తాగిన వాళ్ళని చూసి ఛీత్కరించుకునే వారా

యన. కాని ఇప్పుడీ కష్టాలు భరించలేక తానే తాగి తిరుగుతున్నారు. మారుతున్న కాలం. మనిషి విలువ నెలా మార్చేస్తుంది.

జగన్నాధం, అన్యాయాక్రమాలంటే ఇష్టం లేని వ్యక్తిగా పుట్టి పెరిగిన వ్యక్తి. నలుగురిలో పరువుగా బ్రతికిన మనిషి. కాని సరియైన వైద్యం లేక జబ్బుపడిన భార్యను దక్కించుకుందుకు ఆయన తను పనిచేస్తున్న కంపెనీ డబ్బు కొంత అక్రమంగా వాడేసుకున్నాడు. ఫలితంగా లోకం ఆయన్ని దొంగన్నది. ఉద్యోగం ఊడబెరికిపొమ్మన్నది. దొంగకి మరెక్కడా ఉద్యోగం దొరకలేదు. కుటుంబ పరిస్థితి మొదటికన్నా ఘోరమయింది.

"కాంచన ఏది ?" యింట్లో కొచ్చి డబాయింపుగా అడిగాడు.

"ఉద్యోగానికి కెళ్ళింది."

"వెళ్ళిందా" నిట్టూర్చాడాయన "దొంగకూతురు గదా మరి వెళ్ళకేం చేస్తుంది." పిచ్చివాడిలా నవ్వుతూ మళ్ళీ వీధిలోకెళ్ళిపోయాడు.

వారం రోజులక్రితం సంగతి. టైపిస్ట్ పోస్ట్‌కి ఇంటర్‌వ్యూకెళ్ళివచ్చిన కాంచనని అంతా ఆశగా చూశారు. కాని ఆ పిల్ల దిగాలుపడి ఒక మూలన కూలబడింది.

"ఏమయింది, ఉద్యోగం దొరికిందా" వుండబట్టలేక అంతా అడిగారు లేదన్నట్లు తల అడ్డంగా తిప్పింది.

"మన పరిస్థితులు చెప్పకపోయావా" తల్లి అంది.

"చెప్పాను చెప్పిన మీదట ఆయన అన్నదొక్కటే."

"ఏమిటి" తల్లీదండ్రీ ఇద్దరొక్కసారే ఆదుర్దాగా అన్నారు.

"ఆ ముసలాడికి పడుచు పిల్లలంటే తగనిమోజట. తన మోజు తీరిస్తే, వెధవది ఉద్యోగమేవిటి. కోరినంత జీతమిస్తానన్నాడు."

ఆశించని ఆ జవాబుకి తల్లిదండ్రు లిద్దరూ నిరుత్తరులయ్యారు. అంతలోనే కాంచన సగం దుఃఖంతోనూ, సగం ఆవేశంతోనూ అంది.

"అమ్మా నేనెన్ని కష్టనష్టాలయినా పడతానుగాని, ఇటువంటి దౌర్భాగ్యపు ఉద్యోగాలు మటుకు చేయలేను. నాకసహ్యమటువంటి పనులు. పెళ్ళి చేసుకొని ఒకవ్యక్తి భార్యగా బ్రతకటమెంత శ్రేష్టం. నాకా అదృష్టం లేకపోతేపోని. నన్నిలా పడివుండనియ్యండి. ఉద్యోగాలు ద్యోగాలంటూ నా ప్రాణం తియ్యొద్దు." గబాలున దోసిటలో వదనం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

కూతురి ఏడ్పు చూసి తల్లిదండ్రుల హృదయాలు కరిగిన మాట నిజమే. కాని కనాకష్టమైన పరిస్థితులు. కాలే కడుపులా హృదయాలను త్వరలో మార్చేశాయి. సత్తువలేని ముసలాడయిన జగన్నాధానికి కూలి పని కూడా దొరకలేదు. భాగ్యమ్మకి అంట్లు తోమే కొలువు కూడా దొరకలేదు. రెండురోజుల నుంచి ఇంట్లో ఎవరికీ తిండీ తిప్పలులేవు, అనుక్షణం అప్పులవాళ్ళు ఇంటిచుట్టూ తిరిగి తిరిగి నానా దుర్భాషలాడుతున్నారు, ఇక వేరే అప్పుతెచ్చుకుందుకయినా అవకాశమేది. అమ్ముకుందుకు కూడా ఇంట్లో ఏవీ లేదు. మిగిలిందల్లా ఒక్కటే....పరువంలో వున్న కాంచన.

"కాంచనా పిల్లలు ఆకలితో చచ్చిపోతున్నారే" చావుకి సిద్ధమవుతున్న పిల్లల్ని, భర్తని చూడలేక చివరకు తెగించి అంది తల్లి ప్రొద్దున.

"అయితే నన్నేమి చెయ్యమంటావ్. నిజానికి నేనూ ఆకలితో ఛస్తున్నాను." పరమ చిరాగ్గా అంది.

"ఆ ఉద్యోగం-"

"వాడేమన్నాడో చెప్పానుగదా"

"చెప్పావనుకో .... కానీ ...." తల్లి తటపటాయించింది. ఆ సంభాషణ ఇక తను వినలేనట్లు తండ్రి త్వరగా వీధిలోకెళ్ళిపోయాడు. ఆయనలా వెళ్ళిపోవటమే చెప్పింది కాంచనకి ఈ విషయంలో ఆయన నిర్ణయమేమిటో.

"పిల్లలు చూడు కాంచనా! కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని, లేచేందుకు కూడా శక్తిలేక ఎలా నేలకంటుకుపోయారో. చంటాడికి జ్వరం మండిపోత్తోంది."

"అయితే నన్నా ఉద్యోగానికి వెళ్ళమంటున్నావామ్మా" విస్మయంగా అంది.

".... .... .... ...."

"ఇన్నాళ్ళూ పరువూ మర్యాదలతో బ్రతికిన మనం...."

"ఇంకెక్కడి పరువూ మర్యాదలే." తల్లి విరుచుకుపడింది. "మీ నాన్న ఉద్యోగంతోపాటే అన్నీ ఊడ్చుకుపోయాయ్. మనకు మిగిలినయ్ కష్టాలూ. కన్నీళ్ళే. ఇక ఆ అప్పులవాళ్ళ దుర్భాషలు నేను వినలేను. ఈ పిల్లల చావు కూడా నేను చూడలేను. మీ నాన్న పరిస్థితి మటుకు ఏవి బాగుంది గనుక. మన ముంగిట మృత్యుదేవత నాట్యమాడుతుందే. ఈ రాత్రికైనా ఇంత తిండి దొరకకుంటే, రేపు ఈ యింటి నుంచి ండు మూడు శవాలు లేవటం తథ్యం." దుఃఖంతో పూడుకుపోయిన స్వరంతో అంది.

"వెళ్ళక తప్పదామ్మా" జాలిగా చూసింది.

"రేపీయింట్లో శవాలు చూడటం నీ కిష్టమైతే తప్పకుండా వెళ్ళడం తప్పుతుంది." ఆ మాటని గిరుక్కున వెనుదిరిగి వంటింట్లోకెళ్ళిపోయిందామె. కాంచన సుడిగాలిలా వీధిలో కెళ్ళిపోయింది.

పిల్లికి చెలగాటమైతే ఎలుకకి ప్రాణ సంకటం. పేదవాడి బ్రతుకు గొప్పవాడికి ఆటే. పేదవాడి కష్టాలు, గొప్పవాడికి లాభం. పేదవాడి ఆకలి గొప్పవాడికి సదవకాశం. ఆకలిమంట తీర్చుకుందుకు పోరాటమొకడిదైతే, అంతులేని ఆశల దాహం తీర్చుకుందుకు పోరాడుతుంటాడింకొకడు. గుక్కెడు ప్రాణం నిలుపుకుందు కొకడు యాతన పడుతుంటే, రాతి గుండెతో వికటాట్టహాసం చేసేది మరొకడు. ఏవిటో ఈ లోకపు తీరు మరీ విచిత్రమైనది.

"అక్క డబ్బులు తెస్తుందన్నా వింకా రాలేదామ్మా." పావ మగతలో కలవరించింది.

"వచ్చేస్తుందొచ్చు, చూసొస్తా." వున్న దగ్గరనుంచి లేచి వీధిలో కెళ్ళి తొంగిచూసింది భాగ్యమ్మ. నీరసంతో ఆమెకీ వళ్లు తూలిపోతుంది.

"అమ్మా ఆకలేస్తూందే." సందు చివర గుడిసెలోని రిక్షావాడి కొడుకు తల్లిని సాధిస్తున్నాడు. "యింట్లో కూడునేదురా, అట్టా ఎల్లి యిల్లమ్మట అడుక్కుతిను." కొడుకు చేతికి చిప్ప అందించి పంపుతుంది తల్లి.

రోడ్డున పోతున్నవాళ్ళదగ్గర చెయ్యిచాచి డబ్బులడుక్కున్నాడని విని, ఐదేళ్ళక్రితం ఇదేలచ్చి "ఏరా, మనం కట్టం సేసుకు బతికేటోళ్ళంగాని, బిచ్చగాళ్ళంకాదురా" అంటూ పౌరుషంతో తన కొడుకుని క్రింద పడేసి తన్నింది. కాని ఈనాడు అడుక్కుతినుపోరాని వాడిని వీధిలోకి తరిమింది. కలియుగం, ఆకలియుగం - దాని బ్రతుకంత మార్చేసింది.

ఐదేళ్ళక్రితం పక్కింటి కుర్రాడు పలకరిస్తే మాట్లాడిందని వెంటనే కాంచనని యింట్లోకి పిలిచి చెంపలు వాయగొట్టిందితను. కాని నేడు.... దూరంగా ఒక కొత్త సంచినిండా బియ్యం, మరో సంచినిండా కూరలు పట్టుకొని త్వరత్వరగా నడిచి వస్తున్న కూతుర్ని చూసి "అయ్యో భగవంతుడా ఎక్కడున్నావు తండ్రీ" అంటూ ఆక్రోశించిపోతూ వున్న దరినే కూలబడిందా యిల్లాలు.

★